క్లుప్తంగా

క్రీడాస్ఫూర్తి కలిగి ఉండండి



తెనాలిఅర్బన్: క్రీడాస్ఫూర్తి అందరూ కలిగి ఉండాలని టుటౌన్ ఎస్ఐ షరీఫ్ పేర్కొన్నారు. బుర్రిపాలెం రోడ్డులోని భాష్యం స్కూల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన క్రీడలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం లభిస్తుందని చెప్పారు. అలాగే క్రీడల్లో రాణిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాము, వైస్ ప్రిన్సిపల్ మోహన్‌దాస్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్లపై వ్యర్థాలు లేకుండా చూడాలి

అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి



తెనాలిఅర్బన్: రోడ్లపై వ్యర్థాలు లేకుండా చూడాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతి సూచించారు. పట్టణంలోని 4వ శానిటరీ డివిజన్ కార్యాలయాన్ని మంగళవారం తనిఖీ చేశారు. అటెండెన్స్ పరిశీలించారు. అనతంరం పలు వార్డుల్లో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యర్థాల నిర్వహణపై పలు విమర్శలు వినిపిస్తున్నాయని, అలాంటివి రాకూండా చూసుకోవాలని తెలిపారు. ప్రతిరోజు చెత్త సేకరణను చేయాలని ఆదేశించారు. ఆయన వెంట పలువురు సచివాలయం, మున్సిపల్ ఉద్యోగులు ఉన్నారు.

కార్తిక స్నానాలకు ఏర్పాట్లు పూర్తి



ఫిరంగిపురం: మండలంలోని వేమవరం గ్రామంలోని కోటి ఒక్క లింగాల క్షేత్రంలో కార్తిక మాసాన్ని పురస్కరించుకొని భక్తులకు స్నానాలు చేసేందుకు వీలుగా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ నిర్వాహకులు లక్ష్మీనారాయణ మంగళవారం తెలిపారు. ఆలయ పరిసరాల్లోని ఈశాన్య భాగం వద్ద ఉన్న బావికి గిలకలు ఏర్పాటు చేసి స్నానాలు చేసేందుకు వీలుగా పాక్లెయిన్‌తో పనులు చేయిస్తున్నట్లు చెప్పారు. సమీపంలోని మరకత లింగానికి భక్తులు తమ స్వహస్తాలతో అభిషేకాలు నిర్వహించేలా ఏర్పాటు చేశామన్నారు. మరకతలింగానికి చుట్టూ గోడలు ఏర్పాటు చేసి కుటీరం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వచ్చే నెల 2 నుంచి కార్తిక మాసం ప్రారంభం కానుండటంతో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా అమ్మచారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ బాబా ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

పటేల్ జీవితం ఆదర్శప్రాయం



తాడేపల్లిరూరల్: సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని కేఎల్ యూనివర్శిటీ విద్యార్థి విభాగాధిపతి డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ అన్నారు. మంగళవారం దుగ్గిరాల మండల పరిధిలోని పెదపాలెం జెడ్పీ పాఠశాలలో కేఎల్‌యూ సీఎస్ఈ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సీహెచ్ నాగమణి మాట్లాడుతూ దేశ ఐక్యత, సమగ్రత, భద్రతా భావాన్ని పాటించాలని పాఠశాల విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్యానంతరం పలు సంస్థానాలను దేశంలో విలీనం చేయడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషి ఎనలేనిదన్నారు. భారత రాజ్యాంగ రచనలో ప్రముఖ పాత్ర పోషించారని, దేశ విభజన అనంతరం జరిగిన అల్లర్లను చాకచక్యంగా అణచివేసారని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామారావు, వర్సిటీ వీసీ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఎవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎస్. వెంకట్రామ్, డాక్టర్ కె. రాజశేఖరరావు, డీన్ డాక్టర్ హబీబుల్లా ఖాన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ పి. శ్రీకాంత్ రెడ్డి, ఫీల్డ్ కో ఆర్డినేటర్ పి. సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రిమాండ్ ఖైదీలకు న్యాయ విజ్ఞాన సదస్సు

రేపల్లె రూరల్: పట్టణంలోని సబ్‌జైలులో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రిమాండ్ ఖైదీలకు మంగళవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి టి.వెంకటేశ్వర్లు రిమాండ్ ఖైదీలకు చట్టాలపై అవగాహన కల్పించి సమాజంలో తమ నడవడిక ఏ విధంగా మలుచుకోవాలో వివరించారు. న్యాయవాదులు కొండపల్లి శ్రీనివాసరావు, సబ్‌జైల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

స్కాన్ చేస్తే బిల్లు


- మొబైల్ రీడింగ్, ఆన్‌లైన్ ఫీడింగ్
- మండల సబ్‌స్టేషన్ పరిధిలో పారదర్శకంగా విద్యుత్ బిల్లింగ్
- 19,484 మీటర్లకు 6 ప్రత్యేక మొబైల్ మిషన్లతో విద్యుత్ బిల్లింగ్



స్కాన్ చేయగానే మొబైల్ ఫోన్‌లో వచ్చిన బిల్లు



వెంటనే విద్యుత్ బిల్లును ప్రింట్ ఇస్తున్న మిషన్



తూములూరు గ్రామంలో విద్యుత్ మీటరును స్కానింగ్ చేస్తున్న బిల్‌రీడర్ హరిబాబు

కొల్లిపర: విద్యుత్ మీటరును స్కానింగ్ చేస్తున్న ఇతను హరిబాబు కొల్లిపర మండల సబ్‌స్టేషన్ పరిధిలో రీడింగ్ కాంట్రాక్టర్ క్రింద ఇతను బిల్‌రీడర్‌గా పనిచేస్తారు. మండలంలో ఇలా విద్యుత్ మీటర్‌ను స్కానింగ్ చేస్తే వెంటనే ఎన్ని యూనిట్లు వినియోగించారో... మొత్తం మొబైల్ స్క్రీన్‌పై కనిపిస్తుంది. ఆ విద్యుత్ బిల్లును నేరుగా మొబైల్‌తో అనుసంధానం కలిగి ఉన్న ప్రింటర్ సాయంతో ప్రింట్ వస్తుంది. అంతేకాకుండా ఆ బిల్లు వివరాలు వెంటనే ఆన్‌లైన్‌లో నమోదుతాయి. అనంతరం వినియోగదారులు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ లో బిల్లు చెల్లించవచ్చు. కొల్లిపర మండల పరిధిలో 20 గ్రామాలల్లో గతంలో విద్యుత్ బిల్లు ఇచ్చే సేవలు విద్యుత్ సిబ్బంది మీటరు రీడింగ్ విధానం ఉండేది.

సిబ్బంది క్షేత్రస్థాయిలో మీటర్ రీడింగ్ మిషన్‌తో నమోదు చేస్తూ బిల్లులు ఇచ్చేవారు. ఒక్కోసారి రీడింగ్ యంత్రంలో ఉన్న సిమ్‌కు సిగ్నల్స్ సరిగా అందకపోవడంతో రీడింగ్ ఆలస్యమయ్యేది. అలా రికార్డు చేసిన మీటరు రీడింగ్ వివరాలను సబ్‌స్టేషన్‌లో ఉన్న ఆఫీస్‌లోని సర్వర్‌కు అప్‌లోడ్ చేసే సమయంలోనూ జాప్యమయ్యేది. ఇలా ఒక్కోసారి విద్యుత్ వినియోగం యూనిట్ పరిధి మారిపోయి ఎక్కువ బిల్లులు వచ్చేవి. ప్రతి నెలా మొదటి వారంలో విద్యుత్ వినియోగపు రీడింగ్ నమోదు చేయాల్సి ఉండగా, అప్పుడప్పుడు వివిధ పనుల కారణంగా రెండో వారంలో నమోదు చేస్తే వినియోగదారులకు టారిఫ్ రేట్లు మారిపోయి ఎక్కువ బిల్లులు వచ్చేవి.

మరోవైపు ఆ వివరాల నమోదులోనూ జాప్యం జరగడంతో బిల్లులు చెల్లించడంలోనూ ఆలస్యమయ్యేది. ఈ పాత విధానానికి స్వస్తి పలుకుతూ విద్యుత్ అధికారులు కొన్ని నెలలుగా ఐఆర్‌డీఏ యాప్ ద్వారా స్కానింగ్ ద్వారా మొబైల్ బిల్లింగ్ విధానాన్ని అమలు చేస్తున్నారు.

మొబైల్ బిల్లింగ్ వల్ల ప్రయోజనాలు ఇవీ కొత్త విధానంతో మొబైల్ ఫోన్‌లో అమర్చిన స్మార్ట్ బిల్లింగ్ వెబ్ అప్లికేషన్ మీటరు రీడింగ్ యాప్ ఇన్‌స్టాల్ చేయడంతో ఐఆర్‌డీఏ యాప్‌లోకి వెళ్లి రీడింగ్‌ను స్కానర్‌తో నమోదు చేస్తారు. దీని ద్వారా వినియోగించుకున్న మేరకు కరెంట్ బిల్లులు నమోదవుతాయి. మీటరు రీడింగ్ మార్చేందుకు వచ్చిన సిబ్బందికి అవకాశం లేదు. బిల్లులు నేరుగా ఆన్‌లైన్‌లోనే జనరేట్ కావడంతో ఎలాంటి జాప్యం కాకుండా చెల్లించేందుకు అవకాశం ఉంది. మండలంలో 20 గ్రామాల పరిధిలో 19,484 మీటర్లు ఉన్నాయి. వీటిని ప్రతినెల 2నుంచి 9వ తారీకు లోపల ఆరుగురు సిబ్బంది బిల్‌రీడర్లుగా పనిచేస్తూ బిల్లింగ్ పూర్తి చేస్తున్నారు.

వేగంగా రీడింగ్ నమోదు

మొబైల్ బిల్లింగ్ విధానంతో విద్యుత్ మీటర్ల రీడింగ్ వేగంగా పూర్తవుతుంది. కొన్ని నెలలు నుంచి ప్రతినెలా బిల్లింగ్ సకాలంలో పూర్తి కావడంతో నేరుగా ఆన్‌లైన్‌లో యువత చెల్లింపులు చేస్తున్నారు. వినియోగదారులకు ఆలస్యం కాకుండా బిల్లులు సకాలంలో అందిస్తున్నాం. ప్రస్తుతం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మొబైల్ వినియోగంలో వినియోగదారులు ఏవిధంగా రీచార్జి చేసుకుని ఉపయోగిస్తున్నారు అలాగే త్వరలో మండలంలో స్మార్ట్ మీటర్లు రానున్నాయి అప్పుడు ఎటువంటి బిల్లుతో పనిలేకుండా స్వయంగా వినియోగదారుడు రీచార్జి చేసుకుని తనకు ఎంత వరకు కరెంటు కావాలో నిర్ణయించుకుని వాడుకోవచ్చు.

– ప్రదీప్‌కుమార్, ఏఈ, విద్యుత్‌శాఖ

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తెనాలిరూరల్: విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా తెనాలి పట్టణంలోని పట్టణంలోని రాల్వేస్టేషన్ వద్ద నుంచి ఓవర్ బ్రిడ్జి వరకు బుధవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఏఈ ఎం. లక్ష్మీనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

అనుమతిలేని భవనాలకు అపరాధ రుసుం

తెనాలిఅర్బన్: పట్టణంలో మున్సిపల్ అనుమతి లేకుండా నిర్మించిన భవనాలకు అపరాధ రుసుము విధించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. పట్టణంలో అనుమతిలేని భవనాలను మంగళవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతి లేని భవనాలపై తమకు ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. గృహ యజమానులు ఎవరు అనుమతులు లేకుండా భవనాలు నిర్మించవద్దని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌వో రాంప్రసాద్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

తెనాలిరూరల్: దాడి ఘటనపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి, పట్టణ పినపాడుకు చెందిన మైలా హరికృష్ణ సోమవారం రాత్రి పొద్దుపోయాక ఇంటికి వెళుతుండగా పినపాడుకే చెందిన సుభాని, ఖాదర్ దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు త్రీ టౌన్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు.

ఇంజినీరింగ్ అధికారులపై చర్యలు తీసుకోరా?

- బిల్లులు చేయడంలో ఏఈల జాప్యం
- పనితీరులో మార్పు రావాలని కౌన్సిలర్ల సూచన



అధికారులను నిలదీస్తున్న వైస్ చైర్మన్ హరిప్రసాద్, కౌన్సిలర్లు కోటేశ్వరరావు, రామయ్య



చైర్‌పర్సన్ రాధికకు వినతిపత్రం ఇస్తున్న కౌన్సిలర్లు

తెనాలిఅర్బన్: పురపాలక సంఘ పరిధిలో పని చేసే ఇంజినీరింగ్ అధికారులు అభివృద్ధి పనుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.. పనులు చేసిన కాంట్రాక్టర్ల ఏఈలు బిల్లులను పెట్టకుండా జాప్యం చేస్తున్న అధికారులు వారిపై ఎందుకు చర్యలు తీసుకోవటం లేదంటూ 15వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని మంగళవారం కౌన్సిల్ హాల్‌లో నిర్వహించారు.

సమావేశానికి చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షత వహించారు. రెండవ అంశం చదవటం పూర్తికాగానే కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు లేచి చినరావూరు పార్కులో సమస్యలు ఎక్కువవయ్యాయని, మంత్రి నాదెండ్ల మనోహర్ ఇటీవల పార్కును పరిశీలించి సమస్యలు పరిష్కరించాలని సూచించిన ఇప్పటి వరకు ఆ దిశగా అడుగులు పడలేదని తెలిపారు. ఆహ్లాదం కోసం వచ్చే పట్టణ వాసులకు మౌలిక వసతులు కల్పించకపోతే ఎలా అంటూ ప్రశ్నించారు. ఇంజినీరింగ్ విభాగంలో లోపాలున్న మాట వాస్తవమని, దానిని ప్రక్షాళన చేస్తున్నామని కమిషనర్ బండి శేషన్న తెలిపారు. నెలలోపు ఇంజినీరింగ్ విభాగంలో పూర్తిగా మార్పులు తేస్తామని ప్రకటించారు.

అలాగే వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ మొఘల్ అహ్మద్ రైల్వే స్టేషన్ రోడ్డులోని మున్సిపల్ టాయిలెట్లు అధ్వానంగా ఉంటున్నాయని, వాటిని ఎందుకు బాగు చేయించటంలేదని ప్రశ్నించారు. వాటిని బాగు చేయిస్తామని, మరోసారి ఫిర్యాదులు రాకుండా చూస్తామని ఆరోగ్యాధికారి డాక్టర్ కె.హెలెన్ నిర్మల తెలిపారు. తెనాలి పట్టణంలో రోడ్డు గుంతలుపడి ప్రమాదకరంగా మారాయని, కనీసం వాటిని ప్యాచ్ వర్కులు చేయించడం లేదని వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు.

త్వరలో పట్టణంలోని రోడ్లకు ప్యాచ్ వర్కులు చేయటం జరుగుతుందని కమిషనర్ తెలిపారు. కుక్కల బెడద నుంచి పట్టణవాసులకు విముక్తి కలిగించాలని టీడీపీ కౌన్సిలర్ అన్నం పిన్నారావు, కంపోస్ట్ యార్డులోని వ్యర్థాలను త్వరగా తొలగించాలని మరో టీడీపీ కౌన్సిలర్ అడుసుమల్లి వెంకటేశ్వరరావులు కోరారు. వాటిని త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. అనంతరం వివిధ మున్సిపాలిటీల్లో జరిగే కార్యక్రమాలను పరిశీలించేందుకు కౌన్సిలర్‌లతో టూర్ ఏర్పాటు చేయాలని కోరుతూ చైర్‌పర్సన్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఒకటో అంశం మినహా మిగిలిన అన్ని అంశాలు ఆమోదించినట్లు చైర్‌పర్సన్ రాధిక ప్రకటించి సమావేశాన్ని ముగించారు. సమావేశంలో వైస్ చైర్మన్ అత్తోట నాగవేణి, పలువురు కౌన్సిలర్‌లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

'కూటమి'గా మట్టి తరలింపు

- అత్తోట గ్రామ శివారులో రహదారి వెంట మట్టి తరలింపు
- చోద్యం చూస్తున్న అధికారులు



అత్తోట గ్రామ శివారులో ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్జిన్ లో అక్రమంగా మట్టిని తీస్తున్న దృశ్యం

అత్తోట(కొల్లిపర): కూటమి నాయకుడొకరు రోడ్డు ఇరుప్రక్కల ఉన్న మట్టిని అక్రమంగా సచివాలయం వద్దకు తరలించటం మంగళవారం పట్ట పగలు చోటు చేసుకుంది. మండల పరిధిలోని అత్తోట నుంచి నందివెలుగు వెళ్లే ప్రధాన ఆర్‌అండ్‌బీ రహదారిలో అధికారులు ఎవరు లేకుండా గుట్టు చప్పుడు కాకుండా చేస్తున్న ఈ వ్యవహారంపై పలువురు గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ శివారులో పధాన రహదారిలో ఇరుప్రక్కల మట్టిని తీసి సుమారు 15 ట్రాక్టర్లు సచివాలయం వద్ద ఖాళీ స్థలంలో మట్టి తరలించడంపై వారంతా ప్రశ్నిస్తున్నారు. రోడ్డు మార్జిన్‌లో ఉన్న మట్టిని ఈ విధంగా తరలిస్తే వర్షాలు వచ్చిన సమయంలో మార్జిన్ ఉండదని అటు వంటి సమయంలో రోడ్డు గుంటలు పడి ప్రమాదాలకు దారి తీస్తుందని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా మట్టి తరలించే సమయంలో అక్కడ ఒక్క అధికారి కూడా లేకపోవడంతో ప్రజలకు అనేక అనుమానాలు తావిస్తోంది. దీనిపై ఆర్‌అండ్‌బీ ఏఈ నరసింహా రావు, ఎంపీడీవో విజయలక్ష్మికి ఫోన్ చేయగా వారికి ఈ విషయం తెలియదన్నారు. వెంటనే సిబ్బందిని పంపించి మట్టి తరలించే ప్రక్రియను నిలిపివేస్తామని తెలిపారు. సమాచారం అందుకున్న గ్రామ కార్యదర్శి సంఘటన స్థలానికి వచ్చి అనుమతులు లేకుండా మట్టి తరలించటం నేరమనిఅక్కడ ఉన్న కూటమి పార్టీ నాయకులు, నిర్వాహకులకు స్పష్టం చేశారు. అయితే ఆమె మాట వినకుండా మట్టి తరలించటంతో తిరిగి ఉన్నతాధికారులకు సమాచారం అందించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం కొంత సమయానికి ఆర్‌అండ్‌బీ సిబ్బంది వచ్చి అక్రమ మట్టి తరలింపును నిలిపివేశారు. ముందు ముందు ఇటువంటి సంఘటనలు జరగకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

యువకుడిపై రౌడీషీటర్ దాడి



దగ్ధమైన బైక్

తెనాలిరూరల్: యువకుడిపై రౌడీషీటర్ దాడి చేయడమే కాకుండా అతని బైక్‌ను దగ్ధం చేసిన ఘటన సోమవారం రాత్రి పొద్దుపోయాక ఐతానగర్‌లో జరిగింది. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక నాజరుపేటకు చెందిన కాకుమాను ఇంద్రజిత్ డెకరేషన్ పనులు చేస్తుంటాడు. ఇతని వద్ద పని చేసే యువకుడిని ఐతానగర్‌లో దింపి, సామానును గోడౌన్‌లో పెట్టేందుకు బైక్‌పై వెళ్లాడు. పని చేసే కుర్రాడిని దింపి తిరిగి వస్తుండగా ఐతానగర్ బీఎస్ఏ సెంటరులో తెలిసిన వ్యక్తి కనబడితే పలుకరించి వెళ్లాడు. రౌడీషీటర్ సముద్రాల పవన్ కుమార్ అలియాస్ లడ్డు ఇతని వాహనాన్ని వెంబడించి డాంగే వారి వీధి సమీపంలో అడ్డగించి, తనను పలుకరించకుండా వెళతావా అంటూ ఇంద్రజిత్‌పై రాయి, చేతులు, కాళ్లతో దాడి చేసి గాయపర్చాడు. అంతటితో ఆగకుండా బాధితుడి బైక్‌ను బీఎస్ఏ సెంటరు సమీపంలోకి తీసుకెళ్లి నిప్పంటించాడు. ఇంద్రజిత్ గాయాలతో తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. రౌడీషీటర్ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలిస్తున్నట్లు పోలీసులు మంగళవారం తెలిపారు.

ఉచిత సిలిండర్లకు బుకింగ్

కొల్లిపర: అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వ నిబంధనల మేరకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అందజేయనున్నట్లు తహసీల్దారు జి.సిద్ధార్థ తెలిపారు. మంగళవారం నుంచి బుకింగ్ చేసుకోవచ్చన్నారు. ఇందుకు సంబంధించి వివరాలను రెవిన్యూ కార్యాలయంలో ఆయన తెలియజేశారు. గ్యాస్ కనెక్షన్ వినియోగంలో ఉన్న వారే అర్హులన్నారు. ఆధార్, బియ్యం కార్డు కలిగి ఉండాలన్నారు. గ్యాస్ కనెక్షన్‌తో బియ్యం కార్డు, ఆదార్ కార్డు అనుసంధానమైన డేటాను మిగతా శాఖ డేటాబేస్‌లో సరిచూసుకుని అర్హులైన లబ్ధిదారులకు సిలిండర్లు పంపిణీ చేస్తారని తెలిపారు. లబ్ధిదారులు ముందుగా సొమ్ము చెల్లించి సిలిండర్ పొందాల్సి ఉంటుందన్నారు. అనంతరం 24 గంటల నుంచి 48 గంటల్లో గా లబ్ధిదారులకు ఆధార్ అనుసందానంగా ఉన్న బ్యాంక్ ఖాతాలో నగదు జమ అవుతుందని తెలిపారు.అక్టోబర్ 31వ తేదీ నుంచి వినియోగదారులకు పంపిణీ చేసిన సిలిండర్ల డబ్బులు వారి ఖాతాల్లో జమ అవుతాయని పేర్కొన్నారు. ఈ నెల 31వ తేదీ నుంచి మార్చి 2025 వరకు మొదటి సిలిండర్‌కు బుక్ చేసుకోవచ్చని, ప్రతి నాలుగు నెలలకు ఒక సిలిండర్ చొప్పున ఒక ఆర్థిక సవత్సరంలో మూడు సిలిండర్లు పంపిణీ చేస్తారని వెల్లడించారు. ఒక రేషన్ కార్డులో అనేక మందికి గ్యాస్ కనెక్షన్‌లు ఉన్నా ఒకరి కే వర్తిస్తుంది. ఉచిత గ్యాస్ పొందడానికి ఎటు వంటి ఆన్‌లైన్‌లో నమోదు అవసరం లేదు. గ్యాస్ కనెక్షన్ ఉంది వాడుకలల్లో ఉంటే సరిపోతుందన్నారు. గ్యాస్ బుక్ చేసుకున్న లబ్ధిదారులకు వారి ఫోన్ కు ప్రభుత్వం నుంచి ఉచిత గ్యాస్ బుక్ చేసుకున్నట్లు, డెలివరీ తీసుకున్న 48 గంటల్లో నగదు జమ అవుతున్నట్లు, లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ బుకింగ్ చేసుకున్నందుకు శుభాకాంక్షలు తెలియ జేస్తూ ఖాతాదారులకు మెసేజ్ వస్తుందని తెలిపారు. కావున మండలంలోని గ్యాస్ లబ్ధిదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

ప్రమాదరహితంగా దీపావళిని జరుపుకోవాలి

- సబ్‌కలెక్టర్ సంజనా సింహ
- బాణసంచా స్టాల్స్‌కు లాటరీ పద్ధతిలో కేటాయింపు



స్టాల్స్ కేటాయింపునకు లాటరీ తీస్తున్న సబ్‌కలెక్టర్ సంజనా సింహ

తెనాలి: దీపావళిని ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ ఆకాంక్షించారు. బాణసంచా కాల్చేటపుడు తగిన జాగ్రత్తలు తీసుకుని ప్రమాదరహితంగా జరుపుకోవాలని సూచించారు. వ్యాపారులు నిర్ణీత ప్రదేశంలో వారికి కేటాయించిన స్టాల్స్‌లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం బాణ సంచా విక్రయాలు చేపట్టాలని స్పష్టంచేశారు. అగ్నిప్రమాద నివారణ జాగ్రత్తలను తప్పనిసరిగా అమలుచేయాలన్నారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం బాణసంచా వ్యాపారులకు విక్రయ స్టాల్స్‌ను లాటరీ పద్ధతిలో కేటాయించారు. వ్యాపారుల సమక్షంలో సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ లాటరీ తీశారు. ఈసారి బాణసంచా విక్రయాలకు తెనాలి–విజయవాడ రోడ్డులోని వీఎస్సార్ అండ్ ఎన్‌వీఆర్ కాలేజి మైదానాన్ని ఎంపిక చేశామని చెప్పారు. ప్రమాదాలకు ఆస్కారం లేకుండా ఉంటుందనే ఆ ప్రదేశాన్ని ఎంపిక చేసినట్టు తెలిపారు. బాణసంచా విక్రయాల కోసం 50 మంది దరఖాస్తు చేశారనీ, వారందరికీ తాత్కాలిక లైసెన్సులు మంజూరు చేశామన్నారు. లాటరీ పద్ధతిలో ఇప్పుడు స్టాల్స్ నంబర్లను కేటాయించినట్టు చెప్పారు. దీపావళి రోజు సాయంత్రం నాలుగు గంటల వరకు వారు విక్రయాలు చేసుకోవచ్చని తెలిపారు. లైసెన్సుదారుల కోరికపై, తోపుడుబండ్లపై పట్టణ వీధుల్లో, మరే ప్రదేశంలోనైనా బాణసంచా విక్రయాలకు ఆస్కారం లేకుండా చూస్తామని సబ్‌కలెక్టర్ చెప్పారు. ఆ ప్రకారం సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేస్తామన్నారు. లాటరీ కార్యక్రమంలో తెనాలి మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ ఉన్నారు.

సోలా ముత్యాలరావు ఆదర్శనీయం



ప్రసంగిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు

తాడేపల్లిరూరల్: సీపీఎం అంచలంచెలుగా ఎదిగి వివిధ ప్రజా సంఘాల్లో పని చేసిన సోలా ముత్యాలరావు అభినందనీయులని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని నెహ్రూ బొమ్మ సెంటర్‌లో సోలా ముత్యాలరావు సంస్మరణ సభను సీపీఎం పట్టణ నాయకులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన పాశం రామారావు పలువురు సీపీఎం నాయకులతో కలసి సోలా ముత్యాలరావు చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి ప్రస్థానం మొదలు పెట్టి యువజన సంఘం (డీవైఎఫ్ఐ)లో పనిచేసి, యువతీ యువకులను కూడగట్టి వారి హక్కుల కోసం పోరాడారన్నారు. సోలా మూత్యాలరావు స్ఫూర్తితో కేంద్రంలో, రాష్ట్రంలో పాలక పార్టీలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తామని అన్నారు. నాయకులు జొన్నా శివశంకరరావు, బూరుగ వెంకటేశ్వర్లు, దొంతిరెడ్డి వెంకట రెడ్డి, దొంతిరెడ్డి శ్రీనివాస్ కుమారి, ఎం.రవి, కాట్రగడ్డ శివరామ కృష్ణయ్య, కంచర్ల కాశయ్య, గాదె సుబ్బారెడ్డి, కొట్టే కరుణాకర్‌రావు, ఎం. భాగ్యరాజ్ పాల్గొన్నారు.

హై రిస్క్ ప్రెగ్నెన్సీపై నేడు అవగాహన

ఫిరంగిపురం: హై రిస్క్ ప్రెగ్నెన్సీపై ఆరోగ్య సిబ్బందికి బుధవారం మండలంలోని నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎన్‌సీడీసీడీ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రావణ్‌బాబు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఢిల్లీకి చెందిన ఆర్మన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిక్షణ కార్యక్రమానికి నుదురుపాడు, ఫిరంగిపురం. మేడికొండూరు, పలకలూరు, మందపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చెందిన ఆరోగ్య సిబ్బంది పాల్గొంటారని చెప్పారు. క్షేత్రస్థాయిలో సిబ్బందికి హైరిస్క్ ప్రెగ్నెన్సీల గురించి పూర్తి వివరాలను శిక్షణలో డాక్టర్ చరణ్ తెలియజేస్తారన్నారు. శిక్షణకు వచ్చే సిబ్బంది ఏఎన్‌ఎంల హైరిస్క్ పుస్తకాన్ని తమ వెంట తీసుకురావాలని చెప్పారు. ఆయన వెంట వావిలాల సీతారామ శాస్త్రి ఉన్నారు.

ఉపాధిహామీ పథకంపై అవగాహన సదస్సు



పెరవలి పాలెంలో సీసీ రోడ్లు పరిశీలించిన క్వాలిటీ కంట్రోల్ అధికారులు

వేమూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో నాణ్యతతో కూడిన సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపడతామని పంచాయతీ రాజ్ క్వాలిటీ కంట్రోల్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు రజినీకాంత్ అన్నారు. వేమూరు మండల పరిషత్ కార్యాలయంలో వేమూరు, అమర్తలూరు, చుండూరు ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ వ్యవస్థలో సిమెంట్ రోడ్ల నిర్మాణంలో పలు మార్పులు తీసుకొని రావడం జరిగిందని ఆయన తెలిపారు. సిమెంట్ రోడ్డు నిర్మాణం పూర్తి చేసే లోపు మూడుసార్లు క్వాలిటీ కంట్రోలు తనిఖీ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. వేమూరు మండలంలోని పెరవలి పాలెం గ్రామంలో వేస్తున్న సిమెంట్ రోడ్డును ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ క్వాలిటీ కంట్రోల్ ఏఈ రవీంద్ర, పంచాయతీ రాజ్ ఏఈ బద్రినారాయణ పాల్గొన్నారు.

చేనేత వస్త్రాల తయారీపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న చేనేత కార్మికులు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం రేవేంద్రపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు మంగళగిరిలో తయారు చేసే చేనేత వస్త్రాల తయారీపై మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకేషనల్ ఉపాధ్యాయురాలు కల్యాణి మాట్లాడుతూ మంగళగిరి చేనేత వస్త్రాలు తయారు చేసే విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు మంగళగిరి చేనేత వస్త్రాలు తయారు చేసే ప్రాంతానికి తీసుకు వచ్చామని, చేనేత కార్మికులు వస్త్రాలు తయారు చేయడానికి నూలు వడకడం దగ్గర నుంచి రంగులు అద్దడం, రంగులు అద్దిన నూలు పోగులను విడదీయడం, వాటిని దుస్తులుగా మార్చే విధానంపై పూర్తి వివరాలు చేనేత కార్మికుల ద్వారా విద్యార్థులకు వివరించామని ఆమె అన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు సుజాత, ఝాన్సీ, శాంతి, సుశీల పాల్గొన్నారు.